క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న అధికారులు

దక్కిలి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్, వైద్యాధికారి శ్రీహరి, ఏపీవో లక్ష్మినారాయణ, ఈసీ దామోదర్ రాజు పాల్గొన్నారు.

ధాన్యం లారీ బోల్తా



వాకాడు : మండలంలోని గొల్లపాళెం సమీపంలో బుధవారం ధాన్యం లోడుతో వెళుతున్న లారీ బోల్తాపడింది. వ్యాపారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి లారీలో లోడ్ చేశారు. లారీ నెల్లూరు బయలుదేరింది. వాకాడులోని ఎమ్మార్వో వెనక మలుపు తిరుగుతుండగా అదుపుతప్పి పొలంలోకి బోల్తాపడింది. 30 టన్నుల ధాన్యం లారీలో ఉన్నట్టు రైతులు తెలిపారు. 20 శాతం బస్తాలు నీటిలో తడిచిపోయాయి. సమీపంలో ఉన్న రైతులు అక్కడికి చేరుకుని ధాన్యం బస్తాలను వేరే లారీలోకి మార్చారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

వెంకటగిరి(సైదాపురం) : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరి గా పాటించాలని సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన బుధవారం వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులతో మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో కొంతమంది నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారని తెలిపారు. ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. ఏఎస్ఐ వీబీ రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

264 ఎకరాల్లో నేల వాలిన వరి

వాకాడు : మండలంలో మంగళవారం అర్ధ రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో 264 ఎకరాల్లో వరి పంటలు నేల వాలాయి. మండలంలో ఎడగారు సీజన్‌లో 1550 ఎకరాల్లో వరి సాగు చేశారు. 13 రోజులుగా వరి కోతలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు 870 ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా 680 ఎకరాల్లో కోయాల్సి ఉంది. పెనుగాలులు, భారీ వర్షంతో వరి పంట నేలవాలి పనికి రాకుండా పోయింది.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం ఎన్‌ఎంఎంఎస్

విద్యతో పేదరికాన్ని రూపు మాపవచ్చు. అందుకే ఉచిత నిర్బంధ విద్యను అందించాలని రాజ్యాంగం పేర్కొంది. విద్యకు పేదరికం అడ్డుకాకూడదని భావించిన కేంద్ర ప్రభుత్వం గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పేరుతో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు ఉపకార వేతనాలు అందిస్తోంది. ఇందుకు 8వ తరగతి చదివే పిల్లలు అర్హులు. ఈ ఏడాది ఈ నెల 6వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఎంహెచ్ఆర్‌డీ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ పరీక్ష నిర్వహిస్తుంది.



దక్కిలి హైస్కూల్‌లో 8వతరగతి చదువుతున్న విద్యార్థులు

- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

దక్కిలి: దక్కిలి మండలంలో దక్కిలి, డీవడ్డిపల్లి, దగ్గవోలు, కమ్మవారిపల్లి (పాతనాలపాడు), వడ్ల మోపూరు, తీర్థంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలు ఉన్నాయి. వీటిలో 8వ తరగతి చదివే 359 మంది విద్యార్థులు ఉన్నారు.

దరఖాస్తుకు అర్హతలు ఇవే

- విద్యార్థి 7వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- 8వ తరగతిలో కూడా ఎంపిక నాటికి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎస్సీ ఎస్టీ, దివ్యాంగులకు 50 శాతం మార్కులుంటే చాలు.
- ప్రభుత్వ, మున్సిపాల్టీ, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- విద్యార్థుల తల్లిదండ్రుల కుటుంబ వార్షిక ఆదాయం ఏటా రూ.3.50 లక్షలకు మించరాదు.
- రాత పరీక్ష ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- ఓసీ జనరల్, బీసీ, పీహెచ్ విద్యార్థులు 40 శాతం అంటే కనీసం 36 మార్కులు సాధించాలి.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 32 శాతం 29 మార్కులు సాధించినా అర్హత సాధించినట్లు పరిగణిస్తారు.

పరీక్ష విధానం

- మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్)
- 90 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ఇందులో ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు. మొత్తం 90 మార్కులు కేటాయిస్తారు. మైనస్ మార్కులు ఉండవు.

దరఖాస్తు ఇలా..

www.brw.ap.gov.in విద్యాశాఖ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులను జిల్లా ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు సబ్మిట్ చేయాలి. పరీక్షకు హాజరయ్యే ఇతర కులాలకు చెందిన విద్యార్థులు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజులో 50 శాతం మినహాయింపుతో ఎస్‌బీఐలో చలానా రూపంలో చెల్లించాలి. సెప్టెంబరు 10వ తేదీలోగా ఫీజు చెల్లించి అదే తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను హెచ్ఎంల ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయాలి. అలాగే విద్యార్థుల దరఖాస్తులను అదే నెల 15వ తేదీన అన్ని అప్రూవల్ పూర్తి చేసి అర్హతలు ఉన్న విద్యార్థులకు డిసెంబర్ 8న ఆఫ్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తారు.

స్కాలాస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (శాట్)

ఇందులో 90 మల్టీపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 90 మార్కులకు 7, 9వ తరగతుల స్థాయిలో సైన్సు, సోషియల్, మ్యాథ్స్ పాఠ్యాంశాలకు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కులు ఉండవు. ఫిజిక్స్‌లో 12, కెమిస్ట్రీలో 11, బయాలజీలో 12, మ్యాథ్స్‌లో 20, హిస్టరీలో 10, జియోగ్రఫీలో 10, పొలిటికల్ సైన్సులో 10, ఎకానమిక్స్‌లో 5 మార్కులకు సంబంధించిన ప్రశ్నలుంటాయి.

ఏడాది నుంచి స్కాలర్‌షిప్ పొందుతున్నా



నేను తీర్థంపాడు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాను. 8వ తరగతిలో ఉన్నప్పుడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాశాను. అందులో సెలెక్ట్ కావడంతో 9వ తరగతి ఏటా రూ.12 వేల మెరిట్ స్కాలర్‌షిప్ అందుతోంది. మా లాంటి పేద విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు ఎంతో ఉపయోగకరం.

- తిరుమల శెట్టి శ్రీనాథ్, 10వ తరగతి, తీర్థంపాడు జెడ్పీ హైస్కూల్

ఉపకార వేతనాలు ఎంతో మేలు



గతేడాది 8వ తరగతిలో కష్టపడి చదివి ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాను. ప్రస్తుతం దక్కిలి జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాను. ఏడాదికి రూ.12 వేలు, నెలకు రూ.1000 చొప్పున ఇంటర్ వరకు అందుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. నాకు ఎంతో ఉపయోగంగా ఉంది.

- అక్కుర్తి చరిష్మా, 9వ తరగతి, జెడ్పీ హైస్కూల్ దక్కిలి

విద్యార్థులతో దరఖాస్తు చేయిస్తాం



ఎన్ఎంఎంఎస్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయించేందుకు విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నాం. పరీక్షలో మంచి మార్కులు సాధించే అంశంపై కొన్ని మెళకువలు నేర్పిస్తున్నాం. ఇందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. తల్లిదండ్రుల వివరాలు, వార్షిక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పాం.

- నాగరాజు, దక్కిలి కాంప్లెక్స్ హెచ్ఎం

అన్ని పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలి



మండలంలోని దక్కిలి, దగ్గవోలు, పాతనాలపాడు, డి.వడ్డిపల్లి, తీర్థంపాడు, వడ్లమోపూరు, ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశాం. బాగా కష్టపడి చదివి ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్ వరకు ఉపకార వేతనాలు అందుతాయి.

- కె.వెంకటేశ్వర్లు, ఎంఈవో, దక్కిలి

అనుమతి తప్పనిసరి

వెంకటగిరి రూరల్ : వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వినాయకుడి మండపాల ఏర్పాటు, గ్రామోత్సవం, నిమజ్జనానికి సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పోలీసు అనుమతులు తీసుకోవాలన్నారు. కమిటీలో కనీసం ఐదుగురు సభ్యుల వివరాలు తెలియజేయాలని సూచించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

సైదాపురం: ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ పనులు లేక కూలీలు ఇబ్బంది పడుతున్నారని, జాబ్ కార్డులు ఇచ్చి పనులు చూపించాలన్నారు.

మద్యం షాపుల బంద్ వాయిదా

నాయుడుపేట టౌన్ : ఈ నెల 7న తలపెట్టిన ప్రభుత్వ మద్యం దుకాణాల బంద్‌ను వాయిదా వేసినట్లు నాయుడుపేట డివిజన్ యూనియన్ నాయకులు బుధవారం తెలిపారు. విజయవాడలో భారీ వరదల కారణంగా బంద్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు నేతలు తెలిపారు. రాష్ట్ర నేతలు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారని, సానుకూలంగా నిర్ణయం రానిపక్షంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయించాలి

చిల్లకూరు : ఉపాధి హామీలో కొలతల ప్రకారం కూలీలతో పనులు చేయించాలని ఎంపీడీవో సూర్యసాయి ఆదేశించారు. ఆయన బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కూలీలు కొలతల మేరకు పనులు చేయకపోవడంతో రూ.300ల కూలి అందడం లేదన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో కొంత మంది పనులకు వచ్చే అవకాశం లేదని, కొత్త జాబ్‌కార్డులు తీసుకున్న వారికి పనులు కల్పించాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. పల్లెల్లో జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలన్నారు. ఈవోపీఆర్డీ మాణిక్యం, ఉపాధి ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి గ్రామస్తుల సమస్యలు

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి ఎస్సీ కాలనీని బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సందర్శించారు. పలువురి ఇళ్లకు వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, పలుచోట్ల స్తంభాలు వాలిపోయాయని వివరించారు. కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు చెరువు నుంచి మట్టిని తోలుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. నెలబల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణం బురదమయంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడారు. హౌస్ టూ హౌస్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. నెలబల్లి ఎస్సీ కాలనీలోని పలువురి ఇళ్లకు వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న పేర్లు ప్రకారం ఇక్కడే ఉన్నారా? లేదా? అని పరిశీలించినట్టు తెలిపారు. చేర్పులు, మార్పులపై ఆరా తీసినట్టు వెల్లడించారు. ప్రతి ఏటా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం హౌస్ టూ హౌస్ విచారిస్తామన్నారు. తహసీల్దార్ శైలకుమారి, ఏవో రవికుమార్, డీటీ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య, డీఎల్‌డీవో వెంకటశేషయ్య, ఈవోపీఆర్‌డీ శిఖామణి తదితరులు పాల్గొన్నారు.



నెలబల్లి ఎస్సీ కాలనీలో ఓటరు జాబితాలోని ఓటర్లను విచారిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సామూహిక సీమంతం

గూడూరు రూరల్: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గూడూరులోని వెలుగు కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. సీడీపీవో మహబూబి మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారంతో పాటు వైద్యసిబ్బంది అందించే విటమిన్, ఐరన్ టాబ్లెట్స్‌ను క్రమంతప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో జ్యోతి కిరణ్, వెలుగు ఏపీఎం బుజ్జమ్మ, సూపర్‌వైజర్లు స్వరూపరాణి, చెంచులక్ష్మీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వెంకటగిరి(సైదాపురం) : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీడీపీవో సంషాద్‌బేగం తెలిపారు. పట్టణంలోని బొప్పాపురం, మొక్కలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బంగారుపేట పీహెచ్‌సీ వైద్యులు శివకుమార్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

రాపూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం గోనుపల్లి బీజీ కాలనీలో పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని కోరారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

అంతర్జాతీయ పోటీల్లో క్రీడాకారుడి ప్రతిభ

కోట: నేపాల్‌లో ఆగస్టు 31 నుంచి నాలుగు రోజులు జరిగిన ఎస్‌బీకేఎఫ్ ఇంటర్నేషనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2024 పోటీల్లో కోటకు చెందిన క్రీడాకారుడు సాజిద్‌బాష ప్రతిభ చూపాడు. 40 ప్లస్ విభాగంలో పవర్ లిఫ్టింగ్, జావెలిన్‌త్రోలో గోల్డ్ మెడల్స్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్స్ సాధించాడు.



అంతర్జాతీయ పోటీల్లో అవార్డులు అందుకుంటున్న సాజిద్‌బాష

వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థల చేయూత

గూడూరు రూరల్: విజయవాడ ప్రాంతంలో వరద బాధితులకు సాయం అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. శిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు రూ.లక్ష, చార్టెడ్ అకౌంటెంట్ రామ్మోహన్‌రావు రూ.50 వేలు, రోటరీక్లబ్ వెస్ట్ సభ్యులు రూ.50 వేలను బుధవారం ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన నెల జీతం రూ.1.50 లక్షలను విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

గూడూరు రూరల్: రెండు కిడ్నీలు పాడైన గూడూరు పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన బత్తల రాజకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం రూ.10 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో అమరయ్యనాయుడు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రం సమీపంలోని జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఓటిగుంట చెరువులో గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని, బురకా ధరించి ఉందని ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. మృతదేహం బాగా ఉబ్బిందని వెల్లడించారు. మృతదేహాన్ని నాయుడుపేట ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

కలువాయి : బస్సు ప్రమాదంలో గాయపడి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. సోమశిల–పొదలకూరు రోడ్డులోని వెరుబొట్లపల్లిలో నాలుగు రోజుల క్రితం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కేశమనేనిపల్లికి చెందిన శివరామయ్య గాయపడ్డాడు. అతన్ని నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు.

మద్దతు ఇవ్వలేదని వాటర్‌మ్యాన్ తొలగింపునకు ఒత్తిడి

చిల్లకూరు : స్కూల్ కమిటీ ఎన్నికల్లో తాము ఎంపిక చేసిన వారికి మద్దతు ఇవ్వలేదని ఓడూరులో నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న వాటర్‌మ్యాన్‌ను తొలగించాలని టీడీపీ నాయకులు అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఓడూరు వాటర్ మ్యాన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మనుమరాలు స్థానిక పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. చిన్నారి తల్లి స్కూల్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులకు మద్దతు ఇచ్చింది. దీంతో వాటర్‌మ్యాన్ కుటుంబం తమ మాట వినడంలేదని, అతన్ని తొలగించాలని టీడీపీ నాయకులు పంచాయతీ అధికారులపై ఒత్తిడి చేశారు. సర్పంచ్ వైఎస్సార్ సీపీ మద్దతుదారు కావడంతో వాటర్‌మ్యాన్‌కు జీత భత్యాలు ఇచ్చేది తామని, వీరు విధుల నుంచి ఎలా తొలగిస్తారని అడ్డుకున్నారు. టీడీపీ నేతల తీరుపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

తడ/పెళ్లకూరు/సైదాపురం/రాపూరు/వాకాడు : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు మండలాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వారిని గురువారం సన్మానించనున్నట్టు ఎంఈవోలు తెలిపారు. తడ మండలంలో కాదలూరు, ఫకీరుకండ్రిగ, చేనిగుంట గిరిజన కాలనీల్లోని పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలు పి.శ్రీనివాసులు, పి.శైలజ, ఎస్కే రుక్సానా, పెళ్లకూరు మండలంలో యడపూడి, కానూరురాజుపాళెం ఉపాధ్యాయులు వి.బాలసుబ్రమణ్యం, డోరతి వయోలా, సైదాపురం మండలంలో షేక్ బషీరున్నీషా, పి.కృష్ణకిషోర్, ఎస్.వేణుగోపాల్, యు.స్రవంతి, టీవీ రమణయ్య, రాపూరు మండలంలో రేగడపల్లి పాఠశాల హెచ్ఎం చల్లా మల్లికార్జునరెడ్డి, రాపూరు, గోనుపల్లి, సంక్రాంతిపల్లి, తాతిపల్లి పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పరంధామయ్య, పార్వతి, సుబ్బయ్య, వాకాడు మండలంలో ముట్టెంబాక, తిరుమలూరు యూపీ స్కూళ్ల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎస్కే రషీద్, పంబలి, గంగన్నపాళెం, వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కె.సుష్మ, ఎం.హరికృష్ణ, టి.సుభాషిణి ఉన్నట్టు తెలిపారు.